సాక్షి
ఏలూరు

మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025



ఉలిక్కిపడ్డ ట్రిపుల్ ఐటీ

సీనియర్ ప్రొఫెసర్‌పై ఎంటెక్ విద్యార్థి కత్తితో దాడి చేయడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీలో కలకలం రేగింది. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. 8లో



దళిత కుటుంబాలకు పరామర్శ

దానిగూడెం దళితులపై దాడి నేపథ్యంలో బాధిత కుటుంబాలను ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన దళిత యువకులు పరామర్శించారు. ఈ నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. 8లో



ప్రమాదకరంగా గాలికుంటు

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో గాలికుంటు వ్యాధి పశువుల్లో సోకే అవకాశముందని, పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 8లో

ఖరీఫ్‌లో ఎరువుల గండం

- డీసీఎంఎస్‌ల వద్ద భారీగా క్యూలైన్లు
- రెండు రోజుల క్రితం వరకు జిల్లాలో 8 వేల మెట్రిక్ టన్నుల పంపిణీ
- సోమవారం నాటికి 30 వేల మెట్రిక్ టన్నులు పూర్తి
- అధికారుల గణాంకాలతో అవాక్కవుతున్న అన్నదాతలు
- యూరియా కోసం సొసైటీల వద్ద తప్పని పడిగాపులు
- గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ కొరత
- హడావిడిగా ఇన్‌చార్జి మంత్రి సమీక్ష సమావేశం
- ఇదంతా ప్రతిపక్షాల కుట్ర అంటూ వ్యాఖ్యలు
- అన్నదాతలకు మద్దతుగా నేడు వైఎస్సార్‌సీపీ ఆందోళన
- ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసన ర్యాలీలు, ధర్నాలు



అన్నదాతకు ఎరువుల రూపంలో గండం మొదలైంది. గత ప్రభుత్వ హయాంలో సజావుగా, సక్రమంగా దొరికే ఎరువుల కోసం.. కూటమి ప్రభుత్వ హయాంలో మళ్లీ సొసైటీల చుట్టూ అన్నదాతలు ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. సొసైటీకి ఎరువులు ఎప్పుడు వస్తాయో తెలుసుకుని ఒకపూట క్యూలో పడిగాపులు కాస్తే రెండు, మూడు బస్తాలు దొరికితే గొప్ప అనే పరిస్థితి నెలకొంది. దాదాపు నెల రోజులుగా జిల్లాలో అన్నదాతను ఎరువుల సమస్య పట్టిపీడిస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో 33,762 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉండగా, ఈ నెల ఐదో తేదీకి 8 వేల మెట్రిక్ టన్నులను మాత్రమే పంపిణీ చేశారు. సోమవారం ఏలూరులో హడావిడిగా సమీక్ష సమావేశం ఏర్పాటుచేసిన ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్.. రెండు రోజుల్లో 24 వేల మెట్రిక్ టన్నులు పంపిణీ చేశామని, జిల్లాలో ఎక్కడా కొరతే లేదంటూ ప్రకటించారు. ఇదంతా ప్రతిపక్షాల కుట్రేనని, రైతులు చాలా సంతోషంగా ఉన్నారని ముక్తాయించారు. కట్ చేస్తే... సొసైటీల వద్ద, డీసీఎంఎస్ కేంద్రాల వద్ద భారీగా అన్నదాతలు బారులు తీరిన దృశ్యాలు సోమవారం కూడా కొనసాగడం గమనార్హం.



ఏలూరు డీసీఎంఎస్‌లో ఎరువుల టోకెన్ల కోసం బారులుతీరిన రైతులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు : ఖరీఫ్ సీజన్‌లో రైతుకు సకాలంలో ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఈ క్రమంలో రైతులకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్నదాత పోరు పేరిట ఆర్డీఓ కార్యాలయాల వద్ద భారీ నిరసన ర్యాలీలు, ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో రెండు రోజుల నుంచి ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా అధికార యంత్రాంగం నానా హైరానా పడుతూ అంతా బాగుంది.. అన్నీ అందుబాటులో ఉన్నాయంటూ కొత్త ప్రచారానికి తెర తీసింది. ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు పేరిట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ఏలూరులో హడావిడిగా అధికారులతో సమీక్ష ఏర్పాటు చేసి అన్నీ బాగున్నాయని ప్రకటించారు. ఖరీఫ్‌లో 33,762 మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరం ఉండగా 30,555 మెట్రిక్ టన్నులు పంపిణీ చేసేశామని, 2,200 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచుతామని, పామాయిల్, కోకో, మిర్చి, ఇతర ఉద్యానవన పంటల రైతులు కూడా ఎరువులు వాడుతున్నారని, జిల్లా వ్యాప్తంగా 530 పంపిణీ కేంద్రాలున్నాయని, ఎవరూ ఆందోళన పడవద్దని, జిల్లాలో రైతులు చాలా సంతోషంగా ఉన్నారంటూ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇదంతా ప్రతిపక్షాల కుట్ర అని, కావాలనే అలజడి సృష్టిస్తున్నారంటూ సమస్య వదిలి రాజకీయ విమర్శలకు దిగారు. జిల్లాలో ఎప్పుడు ఏర్పాటు చేశారో తెలియదు కానీ.. 29 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి బ్లాక్ మార్కెట్‌లో విక్రయించేవారిపై 12 కేసులు నమోదు చేసినట్టు కూడా ప్రకటించారు.

రెండు రోజుల్లో 24 వేల మెట్రిక్ టన్నుల పంపిణీ ఎలా?

జిల్లాలో గత శనివారానికి 8 వేల మెట్రిక్ టన్నుల పంపిణీ జరిగినట్టు అధికారిక సమాచారం. ఆగస్టులో 10,183 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా 5496 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశారు. సెప్టెంబర్‌లో 7449 మెట్రిక్ టన్నుల అవసరానికి గాను ఐదో తేదీకి 2,512 మెట్రిక్ టన్నుల పంపిణీ పూర్తి చేశారు. మొత్తంగా రెండు నెలలు కలిపి 8008 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశారు. శని, ఆదివారాలతో పాటు సోమవారం మధ్యాహ్నం నాటికి 30 వేల మెట్రిక్ టన్నులు రైతులందరికీ పంపిణీ చేశామని, అంతా బాగుందని అధికారుల నివేదికల సారాంశం. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ప్రతి సెంటర్ వద్ద భారీగా క్యూ లైన్లు, పడిగాపులు కొనసాగుతూనే ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలు ఉండటంతో ఐదేళ్లలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల సమస్యే తలెత్తలేదు. అది కూడా సీజన్ ప్రారంభంలోనే అవసరమైన ఎరువులను నూరు శాతం పంపిణీ చేశారు. 2022–23లో 26,591 మెట్రిక్ టన్నులు, 2023–24లో 26,090 మెట్రిక్ టన్నులు, 2024–25లో 25,055 మెట్రిక్ టన్నుల యూరియాను జిల్లాలో రైతులకు అందించారు.

నేడు వైఎస్సార్‌సీపీ అన్నదాత పోరు

మంగళవారం ఉదయం ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెంలలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తల నేతృత్వంలో ఎరువుల బ్లాక్‌మార్కెట్‌ను నిరసిస్తూ నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం



రైతులకు సకాలంలో **యూరియా** సరఫరా చేసే **విషయంలో** కూటమి **ప్రభుత్వం** ఘోరంగా **విఫలం చెందింది.** పంటలకు పెట్టుబడి సాయం **చేయకపోగా, కనీ**సం యూరియా కూడా సకాలం**లో సరిపడా ఇవ్వ**కపోతే కూటమి ప్రభుత్వ వైఫల్యం కాకపోతే ఏమనాలి. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఎంత యూరియా అవసరమో అంతా దిగుబడి చేసుకోవాలి. ప్రణాళిక లేకుండా విధి నిర్వహణ ఎలా చేస్తున్నారు? సరిపడా యూరియా దిగుబడి చేసుకోకపోతే సాగు చేసే రైతుల పరిస్థితి ఏమిటి? విజిలెన్స్ శాఖ అధికారులు నిరంతర తనిఖీ చేయాలే తప్ప అమావాస్యకు పౌర్ణానికి తనిఖీలు చేస్తే ఫలితాలు ఉండవు.

– పర్వతనేని నరేంద్రబాబు, రైతు, మలకచర్ల

రైతు సంక్షేమం గాలికొదిలేశారు



కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసింది. రాష్ట్రవ్యాప్తంగా యూరియా కోసం రైతులు ధర్నాలు, ఆందోళనలు చేయడమే ఇందుకు నిలువెత్తు నిదర్శనం. ప్రభుత్వం ఏర్పడిన ఒక సంవత్సరంలోనే రైతుల సంక్షేమం, అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి, ప్రణాళిక ఉంటే యూరియా కొరత వస్తుందా? ఎన్నికల ముందు ప్రచార సభల్లో కూటమి నాయకులు చెప్పిన, ఇచ్చిన హామీలకు, ప్రభుత్వ ఏర్పాటు అనంతరం చేస్తున్న చర్యలకు తేడాను గమనిస్తున్న రైతులు తాము మోసపోయామని తెలుసుకున్నారు.

– మేడూరి రంగబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

న్యూస్‌రీల్

బాధితులకు సత్వర న్యాయం : ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

ఏలూరు టౌన్: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని, బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ పోలీసు అధికారులకు ఆదేశించారు. ఏలూరులోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఫిర్యాదుల స్వీకరణలో పారదర్శకత కోసం పూర్తిగా పేపర్‌లెస్ విధానాన్ని అవలంబిస్తున్నామని చెప్పారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి ఆయా ఫిర్యాదుల పరిష్కారంపై ఆదేశాలిచ్చారు. మొత్తం 38 మంది తమ ఫిర్యాదులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ భవనాల పరిశీలన

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనాలను రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం పరిశీలించారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏమి అవసరమో ఆయన వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే మెడికల్ కాలేజీ, జీజీహెచ్‌లో సిబ్బంది పోస్టులు భర్తీ చేస్తామని, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. జీజీహెచ్‌కు చెందిన కొన్ని భవనాలను మెడికల్ కాలేజీ కోసం వినియోగిస్తున్నారని తెలిపారు. రెండు మూడు నెలల్లో మెడికల్ కాలేజీ భవనాలు పూర్తవుతాయని, అప్పుడు పూర్తిస్థాయిలో జీజీహెచ్‌కు సదుపాయాల కల్పనకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. మంత్రి వెంట మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సావిత్రి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు తదితరులు ఉన్నారు.

స్కూటీతో నేరుగా ఆస్పత్రి వార్డుల్లోకి..

ఇష్టానుసారంగా కాంట్రాక్టర్ తీరు



ప్రభుత్వ ఆసుపత్రి వార్డులో ద్విచక్ర వాహనంపై ఆహారం సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ (ఫైల్)

పాలకొల్లు సెంట్రల్ : ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందించే ఆహారాన్ని కాంట్రాక్టర్ నేరుగా తన ద్విచక్ర వాహనంతో వార్డుల్లోకి తీసుకువెళ్లి అందించడంపై రోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అక్కడున్న ఒక వ్యక్తి ఫొటో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో ఈ విషయం బహిర్గతమైంది. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో భోజనం కాంట్రాక్టర్ ద్వారా ఏర్పాటు చేస్తుంటారు. ఈ కాంట్రాక్టర్ గత కొంతకాలంగా ఆహారాన్ని నేరుగా వార్డుల్లోకి తన ద్విచక్ర వాహనంతో వెళ్లి సరఫరా చేస్తుండటం గమనార్హం. ఆస్పత్రి వైద్యాధికారులు ద్విచక్ర వాహనంతో లోపలికి రావద్దని వారించినా, తాను గత కొంతకాలంగా ఇలానే ఇస్తున్నానంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్టు సమాచారం. సోషల్‌మీడియాలో ఈ విషయం వైరల్ కావడంతో ద్విచక్ర వాహనాన్ని వార్డు వద్ద పెట్టి.. లోపలికి పేషెంట్లను తీసుకెళ్లే వీల్ చైర్‌లో పెట్టుకుని తీసుకెళ్లడం గమనార్హం. మరి అత్యవసర సమయంలో వీల్ చైర్ అవసరమైతే ఏం చేస్తారని ఆసుపత్రికి వచ్చిన రోగుల బంధువులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న యూరియా కష్టాలు



కృష్ణారావుపేట సొసైటీ వద్ద యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

పోలవరం రూరల్: యూరియా కొరత లేదంటూ ప్రభుత్వం చెప్పే లెక్కలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన లేని పరిస్థితి కనిపిస్తోంది. పోలవరం మండలంలోని కృష్ణారావుపేట, పట్టిసీమ, గూటాల, ప్రగడపల్లి సొసైటీల్లో 50.460 మెట్రిక్ టన్నుల యూరియా ఉన్నట్టు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. సోమవారం ఉదయం పట్టిసీమ, పోలవరం సొసైటీల వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఆధార్ కార్డులు పట్టుకుని క్యూ కట్టారు. రైతుకు రెండు బస్తాలు యూరియా వంతున పంపిణీ చేపట్టారు. కొన్ని గంటల్లోనే ఉన్న సరకు అయిపోయింది. దీనిపై రైతులు సిబ్బందిని నిలదీయగా, వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. క్యూలో ఉన్నవారికి మాత్రమే బస్తాలు ఇవ్వడంతో ఆ తర్వాత వచ్చినవారు మిగిలిపోయారు. మిగిలిన రైతులు సుమారు 150 మంది వరకు ఉండటంతో వారికి వచ్చే కోటాలో యూరియా ఇస్తామని నచ్చజెప్పారు. వారికి స్లిప్పులు ఇచ్చి యూరియా వచ్చిన వెంటనే ముందుగా ఇచ్చేందుకు ఏర్పాటు చేయడంతో రైతులు శాంతించి వెనుదిరిగారు. యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనడానికి ఇదో తాజా ఉదాహరణ.

రైతు కన్నీరు సమాజానికి మంచిది కాదు

- అన్నదాత పోరును విజయవంతం చేద్దాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్



కైకలూరు పార్టీ కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తోన్న జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్, నాయకులు

కైకలూరు: రైతు కన్నీరు కారిస్తే సమాజానికి మంచిది కాదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై రైతన్నకు బాసటగా వైఎస్సార్ సీపీ మంగళవారం ఏలూరులో చేపట్టే అన్నదాత పోరును రైతన్నలు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. కైకలూరులోని పార్టీ కార్యాలయంలో పోరుబాట పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిపక్షం రైతు సమస్యలపై ప్రశ్నిస్తే కూటమి ప్రభుత్వం విమర్శలు చేస్తోందన్నారు. యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేసి, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఎరువులను పక్కదారి పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి అందరికీ వర్తింపజేయాలన్నారు. వర్షాల కారణంగా పంట దెబ్బతిన్న రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏలూరులో మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పించి శాంతియుత ర్యాలీ నిర్వహించి, ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తామని చెప్పారు. కైకలూరు నియోజకవర్గ ప్రజలు స్థానిక పార్టీ కార్యాలయానికి ఉదయం 8.30కి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మేధావుల విభాగ కార్యదర్శి బీవీ రావు, రాష్ట్ర మైనారిటీ విభాగ కార్యదర్శి ఎండీ గాలిబ్ బాబు, పార్టీ నేతలు సింగంశెట్టి రాము, గుడివాడ వీర రాఘవయ్య, వడుపు రామారావు, జాస్తి బాబు రాజేంద్రప్రసాద్, పడమట శేషావతారం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో దొడ్డిదారిన గదులు అద్దెకు

- డబ్బులు తీసుకుని టికెట్లు లేకుండా 7 గదులు అద్దెకిచ్చిన సిబ్బంది
- సమాచారంతో తనిఖీలు చేసిన ఆలయ అధికారులు
- శాశ్వత ఉద్యోగి సస్పెన్షన్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి తొలగింపు



శ్రీవారి కొండపైన ధర్మ అప్పారాయ నిలయం

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన ధర్మ అప్పారాయ నిలయం (120 గదుల సత్రం)లో సోమవారం దొడ్డిదారిన గదులు అద్దెకిచ్చి, సొమ్ము స్వాహా చేసిన ఇద్దరు ఉద్యోగుల్లో ఒకరిని అధికారులు సస్పెండ్ చేశారు. మరో ఉద్యోగిని విధుల నుంచి తొలగించారు. వివరాల్లోకి వెళితే.. గుంటూరుకు చెందిన కొందరు భక్తులు సోమవారం ఉదయం శ్రీవారి దర్శనార్థం టూరిస్టు బస్సులో కొండపైకి వచ్చారు. ముందుగా వారు స్నానాదుల కోసం రూములు తీసుకునేందుకు సీఆర్వో కార్యాలయానికి వెళ్లి అక్కడ విధులు నిర్వర్తిస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి వంశీని వివరాలు అడిగారు. ధర్మ అప్పారాయ నిలయానికి వెళ్లి రూములు చూసుకోవాలని అతను సలహా ఇచ్చాడు. దీంతో వారు అక్కడికి చేరుకొని గుమాస్తాగా విధులు నిర్వర్తిస్తున్న శాశ్వత ఉద్యోగి సీహెచ్ పవన్‌కుమార్‌ను గదులు అద్దెకు కావాలని అడిగారు. అతను రూ.4500 నగదు తీసుకొని టికెట్లు లేకుండా 7 నాన్ ఏసీ గదులను అద్దెకు ఇచ్చాడు. దీనిపై సమాచారం అందుకున్న ఆలయ ఈఓ ఎన్వీ సత్యనారాయణ మూర్తి.. వెంటనే ఆలయ ఏఈఓలు మెట్టపల్లి దుర్గారావు, రమణరాజు, ఎలక్ట్రికల్ డీఈ టి.సూర్యనారాయణలతో కలసి ధర్మ అప్పారాయ నిలయానికి వెళ్లి తనిఖీలు జరిపారు. ప్రాథమిక విచారణలో జరిగింది వాస్తవమని, ఉద్యోగులిద్దరూ కుమ్మక్కై ఇదంతా చేశారని అధికారులు తేల్చడంతో పవన్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఈఓ సత్యన్నారాయణ మూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. సీఆర్వో కార్యాలయ ఉద్యోగి వంశీని విధుల నుంచి తొలగించారు. స్వాహా అయిన సొమ్మును వారినుంచి వసూలు చేసి గదులకు అద్దె చెల్లించారు.

యూరియా వినియోగం తగ్గించేలా చర్యలు

రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి నాదెండ్ల ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల

ఏలూరు (మెట్రో): జిల్లాలో యూరియా వినియోగం తగ్గించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులకు ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో ఎరువుల సరఫరా, పంపిణీపై సంబంధిత శాఖల అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగులో యూరియా వినియోగాన్ని తగ్గించేలా రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఎరువులు సొసైటీలకు గతం కంటే ఎక్కువగా అందించే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుత ఏడాది 33,762 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, ఇప్పటికే 30,557 మెట్రిక్ టన్నులు అందించామన్నారు. మరో రెండు రోజుల్లో 2200 మెట్రిక్ టన్నులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. గతంలో వచ్చిన ఈ–పోస్ యంత్రాల సాంకేతిక సమస్యలు ప్రస్తుతం రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యూరియా స్టాక్‌లు సొసైటీలకు అవసరమైన మేరకు ఒకేసారి అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలకు అమ్మడం వంటి వాటిపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ గత ఏడాది కన్నా ఈ ఏడాది రైతులకు అధికంగా ఎరువులను అందించామన్నారు. చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ మాట్లాడుతూ వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులను అందించాలన్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు యూరియా సరఫరా చేయాలని కోరారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ రైతులకు ఎరువులను సక్రమంగా పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా ఎరువుల పంపిణీ చేస్తున్నామన్నారు. సమావేశంలో కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా, ఉద్యాన శాఖ అధికారి రామ్మోహన్, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ డీఎం ప్రసాద్‌గుప్త, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాలో కూటమి విఫలం : సీపీఐ



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): రైతులకు ఎరువుల సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలమైందంటూ సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టారు. ఏలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నానుద్దేశించి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎరువుల కొరతతో అల్లాడిపోతున్నారని, సొసైటీల వద్ద ఎండనక, వాననక క్యూలైన్లలో ఎరువుల కోసం ఎదురుచూపులు చూస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా రైతుల కష్టాలను తీరుస్తామని, రైతులకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత రైతులు పడుతున్న కష్టాలను, ఇబ్బందులను తొలగించడానికి ఏమాత్రం ప్రయత్నం చేయడంలేదని విమర్శించారు. నానో ఎరువుల కంపెనీలతో కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం, అధికారులు ఎరువులు సరిపడా ఉన్నాయని చెబుతున్నా రాష్ట్రంలోని రైతులు క్యూ లైన్లలో నిలబడి పడిగాపులు కాస్తున్న విషయం అధికారులు దృష్టికి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. రైతులకు ఎరువులను సక్రమంగా అందించాలని, బ్లాక్ మార్కెట్లో ఎరువుల అమ్మకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్రంలో 70 శాతం మాత్రమే వ్యవసాయం సాగు చేస్తున్నారని, అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం అందించే యూరియా, డీఏపీ అధికంగా ఉండాలి గానీ కొరత ఎలా వచ్చిందని ప్రశ్నించారు. 30 శాతం సాగు తగ్గినప్పటికీ ప్రభుత్వం ఎరువులను అందించలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో ఉందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, కురెళ్ల వరప్రసాద్, మావూరి విజయ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల తహసీల్దార్ గాయత్రికి వినతిపత్రం అందజేశారు.

కలెక్టరేట్ కోసం 3 రోజుల నిరాహార దీక్ష

భీమవరం (ప్రకాశం చౌక్) : భీమవరం మార్కెట్ యార్డులోనే కలెక్టరేట్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల తొమ్మిదో తేదీ మంగళవారం నుంచి మూడు రోజులపాటు భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ జవ్వాది సత్యనారాయణ (సత్తిబాబు) తెలిపారు. పార్టీలకు అతీతంగా భీమవరం పౌరులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన కోరారు.

ఉలిక్కిపడ్డ ట్రిపుల్ ఐటీ

- ప్రొఫెసర్‌పై దాడితో అప్రమత్తం
- ఆందోళనలో ఫ్యాకల్టీ, నాన్‌టీచింగ్ సిబ్బంది


నూజివీడు ట్రిపుల్ ఐటీలోని అకడమిక్ భవనం

నూజివీడు: ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న సీనియర్ ప్రొఫెసర్‌పై ఎంటెక్ విద్యార్థి కత్తితో దాడి చేయడంతో ట్రిపుల్ ఐటీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇక్కడ పనిచేస్తున్న మెంటార్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు, గెస్ట్ ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్ సిబ్బంది అందరూ దాడి సంఘటనతో ఆందోళనకు గురయ్యారు. ఆర్జీయూకేటీకి గతంలో రిజిస్ట్రార్‌గా, నూజివీడు ట్రిపుల్ ఐటీకి డైరెక్టర్‌గా, ఏఓగా, అడ్మిషన్ల కన్వీనర్‌గా పనిచేసిన సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజుపై ఎంటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థి వినయ్ పురుషోత్తం కత్తితో దాడి చేయడాన్ని ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్ స్టాఫ్, మెంటార్ల యూనియన్‌లు ముక్తకంఠంతో తీవ్రంగా ఖండించాయి. ఒక విద్యార్థి జేబులో రెండు కత్తులు పెట్టుకొని తరగతి గదికి రావడంపై ఆందోళన వ్యక్తం చేశాయి. ఇలా అయితే తమకు రక్షణ ఏముంటుందని ఫ్యాకల్టీ ముక్తకంఠంతో ప్రశ్నిస్తోంది. 9,900 మంది విద్యార్థులున్న నూజివీడు ట్రిపుల్ ఐటీలో ముస్ముందు తమ పరిస్థితి దారుణంగా ఉంటుందేమోననే ఆందోళన వ్యక్తం చేస్తోంది. దాడి జరిగింది తరగతి గదిలో కాబట్టి మిగిలిన విద్యార్థులందరూ వచ్చి నిలువరించారని, ఇదే సంఘటన ప్రొఫెసర్ కేబిన్‌లో జరిగి ఉంటే దాడి నుంచి ప్రొఫెసర్‌ను ఎవరు కాపాడేవారని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఫ్యాకల్టీకి భద్రత డొల్లేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తరగతులకు హాజరుకాకుంటే ఏం చేస్తున్నారు?

ప్రొఫెసర్‌పై దాడికి పాల్పడిన ఎంటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థి వినయ్ పురుషోత్తం ప్రారంభం నుంచి తరగతులకు, ల్యాబ్‌లకు గానీ హాజరయ్యేవాడు కాదని ట్రిపుల్ ఐటీ వర్గాలు పేర్కొంటున్నాయి. రెసిడెన్షియల్ విధానంలో నిర్వహిస్తున్న ట్రిపుల్ ఐటీలో తరగతులకు రాకుండా హాస్టల్ గదిలోనే ఉంటున్నప్పుడు పరిపాలన చేసే అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హెచ్ఓడీ, డీన్ అకడమిక్స్, డైరెక్టర్‌లు నిత్యం గైర్హాజరవుతున్న విద్యార్థులను గుర్తించి ఎందుకు గైర్హాజరవుతున్నారో తెలుసుకొని ఆ విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేయాల్సి ఉన్నప్పటికీ అలా చేసిన దాఖలాలు లేవు. ఈ విద్యార్థి తన రూమ్‌లో ఉండే మరికొందరు విద్యార్థులతో కూడా మాట్లాడకుండా ఉంటాడని పలువురు పేర్కొంటున్నారు. హాస్టల్‌లో ఉండే విద్యార్థులు సహజంగా పండ్లు కోసుకోవడానికి ఇంటి వద్ద నుంచే చాకులు తెచ్చుకుంటారు. అయితే ఇతను రెండు చాకులను జేబులో పెట్టుకొని తరగతి గదికి రావడాన్ని బట్టి చూస్తుంటే దాడి చేయాలనే లక్ష్యంతోనే ఉద్దేశపూర్వకంగా తెచ్చుకున్నట్లుగా ఉందని అధ్యాపకులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం కఠినంగా వ్యవహరించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

తగ్గుతున్న గోదావరి వరద

పోలవరం రూరల్: గోదావరి వరద రోజు రోజుకు తగ్గుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి నదిలోకి చేరే నీరు క్రమేపీ తగ్గుతుండటంతో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 29.950 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే నుంచి 4.75లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతోంది. ఎగువన భద్రాచలం వద్ద 26.10 అడుగులకు నీటిమట్టం చేరుకుంది.

పశ్చిమగోదావరి బీసీ కమిటీ ఇన్‌చార్జిగా రంగారావు


చెన్ను రంగారావు

నాగాయలంక: కృష్ణా జిల్లా నాగాయలంక మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం జాయింట్ సెక్రటరీ చెన్ను రంగారావును పశ్చిమ గోదావరి జిల్లా బీసీ కమిటీ ఇన్‌చార్జిగా నియమించారు. ఈ విషయాన్ని సోమవారం ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ గోదావరి జిల్లా బీసీ కమిటీ ఇన్‌చార్జి బాధ్యతలను తనకు అప్పగించినందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రాజగొల్ల రమేష్‌యాదవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎరువుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు


తనిఖీ చేసిన్న అధికారులు

కామవరపుకోట: విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవిన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్త ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలలో ఏకకాలంలో రెండు బృందాలుగా ఎరువులు షాపులపై ఆకస్మిక తనిఖీ చేసినట్లు విజిలెన్స్ డీఎస్పీ సింగలూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ద్వారకాతిరుమల మండలం, సీహెచ్ పోతేపల్లిలో రెండు షాపులు, పంగిడిగూడెంలో ఒకటి, కామవరపుకోట మండలం తడికలపూడిలో రెండు షాపుల్లో తనిఖీలు చేయగా శ్రీ సాయి ధన లక్ష్మి ట్రేడర్స్, వెంకటరమణ ట్రేడర్స్‌లో ఓ-ఫారం లేనందున 41.700 టన్నుల ఎరువులు అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు.

మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకున్న పోలీసులు


పోలీసులు సీజ్ చేసిన జేసీబీ

ద్వారకాతిరుమల: మండలంలోని గుణ్ణంపల్లి పంచాయతీ తక్కెళ్లపాడులో తాడిపూడి కాలువ గట్టుపై గ్రావెల్ మట్టి అక్రమ తవ్వకాలను ఆదివారం రాత్రి పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఒక జేసీబీని, టిప్పర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్థానికుల కథనం ప్రకారం.. తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన ఒక టీడీపీ నాయకుడు కాలువ మట్టిని ఆదాయ వనరుగా ఎంచుకున్నాడు. రాత్రి వేళల్లో జేసీబీ సహాయంతో కాలువ గట్టుపై గ్రావెల్ మట్టిని తవ్వి, టిప్పర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నాడు. ఆ మట్టిని రియల్ ఎస్టేట్ వెంచర్లు చదును చేసేందుకు వినియోగిస్తున్నారు.

దళిత కుటుంబాలకు పరామర్శ

కైకలూరులో 144 సెక్షన్, భారీగా పోలీసుల మోహరింపు

కైకలూరు: దానిగూడెం దళితులపై దాడి నేపథ్యంలో కైకలూరు పట్టణంలో నాలుగు రోజులుగా పోలీసులను మెహరించారు. నిందితులను రిమాండ్‌కు తరలించినప్పటికీ ప్రధాన సూత్రదారుడిని అదుపులోకి తీసుకోవాలంటూ దళిత నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం నియోజకవర్గం, ఇతర ప్రాంతాల నుంచి దాదాపు 150 మంది దళిత యువకులు పోలీసుల వలయాన్ని చేధించుకుని దానిగూడెం చేరుకున్నారు. దానిగూడెం ప్రజలు వంటా, వార్పుతో మద్దతు తెలపడానికి వచ్చిన వారికి భోజనాలు అందించారు. డీఎస్పీ, పలువురు సీఐలు, ఎస్ఐలు కలిపి దాదాపు 200 మంది పోలీసులు విధులు నిర్వహించారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదు.. సంక్షేమం లేదు.. రోజు రోజుకు దళితులు, బీసీలు, ఎస్టీలు, మైనార్టీ కులాలపై అత్యాచారాలు, హత్యలు, అరాచకాలు జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి గురుప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. దానిగూడెంకు పోలీసులు వెళ్ళనీయకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో కీలక వ్యక్తులను అరెస్టు చేసి అందరిపై రౌడీషీట్లు ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దళితులపై దాడులు అరికట్టడంలో ప్రభుత్వం విఫలమవుతోందని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కన్వీనర్ ఉప్పులేటి దేవీ వరప్రసాద్ విమర్శించారు. ఇటీవల తెనాలి, తణుకు, ఇప్పుడు కై కలూరులో దళితులపై దాడులు జరిగాయన్నారు. రోడ్డుపై ఆందోళనలు చేశారంటూ దళితులపై పోలీసులు నమోదు చేసిన కేసులను ఉపసంహరించాలన్నారు. ప్రధాన నిందితుడు కొల్లి బాబీని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నాగ జగన్ బాబూరావు, కృష్ణాజిల్లా మాలమహానాడు అధ్యక్షుడు దోవా గోవర్ధన్, దళిత నాయకులు పాల్గొన్నారు. సున్నితమైన అంశంపై కావాలని ఘర్షణలకు పాల్పడితే సహించమని డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. 144 సెక్షన్ అములులో ఉందన్నారు. దళితులపై దాడి కేసులో ఇప్పటికే అరెస్టులు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. మరొకరిపై ఆరోపణలను నిర్ధారణ చేసుకుని చర్యలు తీసుకుంటామన్నారు.



దానిగూడెంలో పోలీసులతో మాట్లాడుతున్న దళిత మహాసభ అధ్యక్షుడు చింతపల్లి గురుప్రసాద్

పశువుల్లో ప్రమాదకరంగా గాలికుంటు

- నిర్లక్ష్యం చేస్తే నష్టం తప్పదంటున్న పశుసంవర్ధక శాఖ
- ఈనెల 15 నుంచి వ్యాధి నివారణ ఉచిత టీకాలు


గాలికుంటు కారణంగా పశువు కాలిలో పుండు


పశువు నోట్లో పుండ్లు పడిన దృశ్యం



భీమవరం: వ్యవసాయమే జీవనాధారమైన పశ్చిమ గోదావరి జిల్లాలో వరిసాగు తరువాత రైతులు ఎక్కువగా పశువుల పెంపకంపై ఆధారపడతారు. వేణ్నీళ్లకు చన్నీళ్లు సాయం అనే నానుడితో వ్యవసాయంతో పాటు పాడిపశువులను పెంచుతున్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను బట్టి పశువులకు గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డీసీజెస్) సోకే అవకాశముంది. ఈ వ్యాధి కారణంగా పాల దిగుబడి తగ్గిపోవడం, పనిసామర్థ్యం తగ్గిపోయే ప్రమాదముంది. వ్యాధి సోకిన పశువుల పాలు తాగిన లేగ దూడలు చనిపోయే అవకాశం ఉంది. గాలికుంటు వ్యాధి తీవ్రమైన అంటు వ్యాధి. ఇది పశువులకు, పందులకు, మేకలకు, గొర్రెలు వంటి జంతువులకు సోకుతుంది. ఈ వ్యాధికి కారణం పిక్కోర్నావిరిడే అనే వైరస్.

అధిక జ్వరం, నోట్లో పుండ్లు లక్షణాలు

గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు అధిక జ్వరం వస్తుంది. పశువుల నోటి లోపల, నాలుకపై, చిగుళ్ళ, పెదవులపైన నీటి పొక్కులు ఏర్పడతాయి. ఇవి పగిలి పుండ్లుగా మారతాయి. దీని కారణంగా పశువులు మేత తినడానికి ఇబ్బంది పడతాయి. పశువుల పాదాల మధ్య, గాలికుంటుపైన, కాళ్ళపైన నీటి పొక్కులు ఏర్పడి అవి పగిలి పుండ్లుగా మారి పశువులు నడవడానికి ఇబ్బంది పడతాయి. దీనివల్ల పశువులు కుంటుతూ నడుస్తాయి. అందుకే ఈ వ్యాధిని గాలికుంటు వ్యాధి అంటారు. నోట్లో పుండ్ల కారణంగా పశువులు నోటి నుంచి ఎక్కువగా లాలాజలాన్ని స్రవిస్తాయి.

పాలు ఉత్పత్తిపై ప్రభావం

పశువులు మేత సరిగా తినకపోవడం వల్ల వాటి బరువు తగ్గిపోతుంది. దూడలలో ఈ వ్యాధి గుండె కండరాలను ప్రభావితం చేస్తుంది. అందువల్ల గుండె పోటు వచ్చి మరణాలు సంభవించే అవకాశం ఉంది.

గాలికుంటు ఎలా వ్యాపిస్తుంది

వ్యాధి సోకిన పశువుల నుంచి ఆరోగ్యంగా ఉన్న పశువులకు నేరుగా వ్యాధి వ్యాపిస్తుంది. కలుషితమైన మేత, నీరు, పరికరాల ద్వారా వ్యాపిస్తుంది. అంతే కాకుండా గాలి ద్వారా కూడా ఈ వైరస్ కొంత దూరం వరకు వ్యాపిస్తుంది.

వ్యాధి చికిత్స, నివారణ

- ఈ వ్యాధి నివారణకు నిర్దిష్టమైన చికిత్స లేదు. సాధారణంగా వ్యాధి లక్షణాల ఆధారంగా చికిత్స చేయాలి.
- పుండ్లలో ఇన్ఫెక్షన్ రాకుండా ఉండటానికి యాంటీబయోటిక్స్ ఉపయోగించవచ్చు. నోట్లోని పుండ్లను శుభ్రం చేయడానికి పొటాషియం పర్మాంగనేట్ వంటి ద్రావణాలను ఉపయోగించాలి. పాదాల పుండ్లకు అయోడిన్ లేదా ఇతర యాంటిసెప్టిక్ ద్రావణాలను ఉపయోగించవచ్చు. వ్యాధి నివారించడానికి టీకాలు వేయించడం చాలా ముఖ్యం. పశువులకు ప్రతి ఆరు నెలలకొకసారి టీకాలు వేయించాలి. పాడి పశువులు ఉండే స్థలాన్ని శుభ్రంగా ఉంచాలి. పశువులను ఒకదానికొకటి దూరంగా ఉంచాలి.

15 నుంచి ఉచిత టీకాలు



పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ఈనెల 15 నుంచి జిల్లా వ్యాప్తంగా ఉచితంగా టీకాలు వేస్తున్నారు. సుమారు 45 రోజులపాటు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో టీకాలు వేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే అనేక నష్టాలు ఏర్పడనున్నందున ఉచిత టీకాలను పాడి రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి. **పి.సుధీర్‌బాబు, ఏడీ, పశుసంవర్ధకశాఖ, భీమవరం**

నలుగురు నిందితుల అరెస్టు

ఉండి: గత నెల 31న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సును అడ్డగించి క్లీనర్‌ను కొట్టిన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 31న రాత్రి ఉండి మండలం గోరింతోట వద్ద ఐదుగురు వ్యక్తులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సును అడ్డగించి దాని క్లీనర్‌ను కొట్టి రూ.వెయ్యి నగదు, సెల్ ఫోన్ దోచుకున్నారు. దీనిపై క్లీనర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు, ఎస్సై ఆధ్వర్యంలో సోమవారం దాసి విజయ్, నేతల అజయ్‌బాబు, పోతురాజు ఆనంద్, మరో మైనర్ బాలుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

డ్రెయిన్‌లోకి దూకి ఆత్మహత్యాయత్నం

భీమవరం: భీమవరం పట్టణంలోని యనమదుర్రు డ్రెయిన్‌లోకి దూకి మహిళ ఆత్మహత్యకు ప్రయత్నించడం పట్టణంలో కలకలం రేపింది. సోమవారం ప్రభుత్వాసుపత్రికి సమీపంలో యనమదుర్రు డ్రెయిన్‌పై కాలిబాట వంతెన సమీపంలో మహిళ కాలువలోకి దూకిందంటూ ప్రచారం జరగడంతో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. భీమవరం పట్టణంలోని 26వ వార్డుకు చెందిన మహిళ కుటుంబ కలహాల నేపథ్యంలో దూకినట్లు చెబుతున్నారు. అయితే ఈ ఘటనపై స్థానిక పోలీసులను వివరణ కోరగా తమకు ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఇరగవరం: మండలంలోని అయినపర్రు పొలాల్లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఇరగవరం హెడ్ కానిస్టేబుల్ ఐ.కృష్ణారావు తెలిపారు. నీలం రంగు జీన్స్, ఆరెంజ్ రంగు టీ షర్టు ధరించాడని, 30 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉంటుందని.. ఎత్తు 5 అడుగుల 8 అంగుళాలు ఉంటుందని చెప్పారు. వీఆర్వో సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని పంచనామా నిమిత్తం తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9440796681, 9440796639 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

క్షీరారామంలో పోటెత్తిన భక్తజనం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయంలో చంద్రగ్రహణం విడుపుకాలం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు దానాలు సమర్పించుకున్నారు. క్యూలైన్లు నిండిపోయాయి. సాయంత్రం ప్రదోషకాలంలో భక్తులు సప్త సోమవారం ప్రదక్షిణల్లో పాల్గొన్నారు. ప్రదక్షిణలు అనంతరం స్వామివారికి పంచహారతుల కార్యక్రమం నిర్వహించారు.

తెరుచుకున్న శ్రీవారి ఆలయం


శ్రీవారి ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలో భక్తుల సందడి

ద్వారకాతిరుమల: రాహుగ్రస్త సంపూర్ణ చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం మూతపడ్డ శ్రీవారి ఆలయం సోమవారం ఉదయం తెరచుకుంది. ముందుగా దేవస్థానం సిబ్బంది ఆలయ పరిసరాలను కడిగి శుభ్రం చేశారు. ఆ తరువాత అర్చకులు సంప్రోక్షణలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు ఉదయం 9.30 గంటల నుంచి భక్తులకు స్వామివారి సర్వదర్శన భాగ్యాన్ని కల్పించారు. గ్రహణం అనంతరం స్వామివారిని దర్శిస్తే మంచిదని భావించిన భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

10న క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ సెమీస్


భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో వివరాలు వెల్లడిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ సెమీఫైనల్స్ ఈ నెల 10న జరుగుతాయని కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు సోమవారం తెలిపారు. ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు, టెక్నాలజీ సెంటర్ హెడ్ ఎన్.గోపాలకృష్ణమూర్తితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం వెల్లడించారు. ఈ పోటీలకు ఉభయ గోదావరి జిల్లాల్లోని 20 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 40 బృందాలకు సంబంధించి 240 మంది విద్యార్థులు హాజరవుతున్నట్టు చెప్పారు. బుధవారం ఉదయం 8:30 గంటలకు కళాశాల ఓపెన్ ఆడిటోరియంలో జరిగే ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎన్టీయూ కాకినాడ వైస్ చాన్సలర్ సీఎస్ఆర్‌కె ప్రసాద్ హాజరవుతారని న్యాయ నిర్ణేతగా ఉన్నత విద్యా మండలి మాజీ వైస్ చైర్మన్, ఆంధ్ర యూనివర్సిటీ సీఎస్ఎస్ఈ విభాగం ప్రొఫెసర్ వి.వల్లికుమారి వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సెమీఫైనల్స్ పోటీల్లో విజేతలు ఈ నెల 13న జరిగే ఫైనల్స్ పోటీల్లో పాల్గొంటారని రీజనల్ సెంటర్ కోఆర్డినేటర్ పి.రవికిరణ్‌వర్మ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ఇన్‌చార్జ్‌గా శ్రీనివాసరావు


గొలగాని శ్రీనివాసరావు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా బీసీ సెల్ ఇన్‌చార్జ్‌గా గొలగాని శ్రీనివాసరావును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు ఏలూరు బీసీ సెల్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించడంతో ఆ పార్టీ బీసీ సెల్ నేతలు ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా గొలగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బీసీ సెల్ ఏలూరు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించడంపై పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అదనపు పొగాకు విక్రయానికి అనుమతులు

కొయ్యలగూడెం: వర్జీనియా అదనపు పొగాకు విక్రయానికి రైతులకు అనుమతులు ఇస్తున్నట్లు పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం పొగాకు వేలం కేంద్రానికి విచ్చేసిన ఆయన కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించి రైతు ప్రతినిధులతో సమావేశ ం నిర్వహించారు. ఈ సీజన్లో తక్కువ సుంకంతో అమ్ముకోవడానికి అనుమతి లభించిందని, రైతులు వచ్చే సీజన్‌కి ఈ పరిస్థితి ఉండకపోవచ్చన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్‌కి పోటీ పెరిగే అవకాశం ఉందని కావున రైతులు పరిమితికి మించి పండించరాదని నిర్దేశించిన కోటాకు కట్టుబడి ఉండాలని లేకపోతే నష్టపోయే ప్రమాదం ఉందని సూచించారు. కార్యక్రమంలో ఉత్తర తేలిక నేలల ప్రాంతీయ అధికారి జీఎల్‌కే ప్రసాద్, వేలం నిర్వహణాధికారి గ్రేస్ మార్గరెట్, రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల వివేకానంద పాల్గొన్నారు.